చెంతకే వైద్య సేవలు

- 41, 42 వార్డుల ప్రజల కోసం సుబ్బలక్ష్మీనగర్‌లో ఆరోగ్య కేంద్రం
- అందుబాటులో వైద్య నిపుణులు, మందులు



రైల్వే న్యూకాలనీ సుబ్బలక్ష్మీనగర్‌లోని వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్

తాటిచెట్లపాలెం: ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే సదుద్దేశంతో.. వైద్యానికి పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. జీవీఎంసీ ప్రతి వార్డులోనూ వీటిని ఏర్పాటు చేయిస్తున్నారు. ఈ హెల్త్ సెంటర్ల ద్వారా పేదలకు ఉచితంగా అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తూ మందులు అందజేస్తున్నారు.

జీవీఎంసీ 41(కొంత భాగం), 42 వార్డుల ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలను మరింత చేరువ చేశారు. రైల్వే న్యూకాలనీలోని సుబ్బలక్ష్మీనగర్ సుబ్బలక్ష్మి కల్యాణ మండపం వద్ద సుమారు కోటిన్నర రూపాయలతో యూపీహెచ్‌సీ నిర్మించారు. గతేడాది అక్టోబర్‌లో దీనిని ప్రారంభించినప్పటికీ.. ఈ సంవత్సరం మొదలు నుంచి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడిప్పుడే ఈ ఆరోగ్య కేంద్రం గురించి పరిసర ప్రాంతాల ప్రజలకు తెలుస్తుండటంతో ప్రతి రోజు ఇక్కడికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. సాధారణ సేవలతో పాటు స్పెషలిస్ట్ వైద్య సేవలు కూడా ఆయా రోజుల్లో అందుబాటులో ఉన్నాయి. ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇక్కడ వైద్యులు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉంటారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలన్నింటితోపాటు గైనిక్ వంటి సమస్యలకు కూడా చికిత్స చేస్తున్నారు. సాధారణ రోజుల్లో రోజుకు 50 నుంచి 60 మంది, స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్న రోజుల్లో మరింత ఎక్కువ మంది ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు.

స్పెషలిస్ట్ సేవల వివరాలు

సుబ్బలక్ష్మీనగర్ యూపీహెచ్‌సీలో స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉంటూ సేవలు నిర్వహిస్తున్నారు.

- ప్రతి బుధవారం: జనరల్ ఫిజీషియన్, గైనకాలజీ.
- ప్రతి గురువారం ఆర్థోపెడిక్, పల్మనాలజీ.
- ప్రతి శుక్రవారం చర్మ సంబంధిత సమస్యలకు చికిత్స.
- ప్రతి శనివారం పీడియాట్రిక్స్, ఈఎన్‌టీ వంటి సమస్యలకు ఆయా స్పెషలిస్ట్ వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారు.

ప్రస్తుతం నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు

ఈ యూపీహెచ్‌సీలో ప్రస్తుతం హెచ్‌బీ, ఆర్‌బీఎస్, సీబీసీ వంటి అన్ని రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇవి కాకుండా ఆర్‌ఎఫ్‌టీ, ఎల్‌ఎఫ్‌టీ, లిపిడ్ ప్రొఫైల్, మలేరియా, డెంగ్యూ, ఎలక్ట్రోలైసిస్, పొటాషియం, సోడియం, యూరిన్, ఈసీజీ, ప్రెగ్నన్సీ వంటి పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. చెంతకే వైద్య సేవలు రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన


అంబేడ్కర్ కాలనీలో కళావేదిక పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో పలు అభివృద్ధి పనులను గురువారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పరిశీలించారు. అంబేడ్కర్ కాలనీలోని గ్రీన్‌బెల్ట్ ప్రాంతం, కళావేదిక తదితర జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. ప్రజలు ఇబ్బంది పడకుండా పనులను త్వరగా సంపూర్ణంగా పూర్తిచేయాలని సూచించారు. ఏఈ అర్చన, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్, టౌన్ ప్లానింగ్ సూర్య, లక్ష్మణ్, కావ్య, కాంట్రాక్టర్ సునీల్ తదితరులు కార్పొరేటర్ వెంట ఉన్నారు.

వృద్ధులకు 'కంటి వెలుగు' పరీక్షలు


కళ్లద్దాలు అందిస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు వెంకటేశ్వర కాలనీ సచివాలయంలో గురువారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ తనూజ, ఆప్తమాలజిస్ట్ డాక్టర్ ఎస్.సంధ్యారాణి స్థానిక వృద్ధులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లద్దాలను కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీలు ఆర్.మాధవి, జి.వేణు, అడ్మిన్ సలీమ బేగం పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలోని 11 కేవీ శాంతిపురం, బీఎస్ లేఅవుట్, 11 కేవీ వుడా కాంప్లెక్స్ ఫీడర్లలో మరమ్మతులు, చెట్టు కొమ్మల ట్రిమ్మింగ్ నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జోన్-1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎన్ఆర్ఐ హాస్పిటల్, సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం జంక్షన్, నార్త్ ఎక్స్‌టెన్షన్ షిర్డీసాయిబాబా దేవాలయం రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

మద్రిపాలెం సెక్షన్‌లో..

మురళీనగర్: మద్రిపాలెం సెక్షన్ పరిధిలోని ఇందిరానగర్, ఈపీఎఫ్ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇందిరానగర్ 1-5, సంజీవయ్య కాలనీ, జయప్రకాష్‌నగర్-1, తిక్కవానిపాలెం, మద్రిపాలెం వుడా లేఅవుట్, శివశివానీ పాఠశాల, పోలీస్ క్వార్టర్స్, ఈపీఎఫ్ క్వార్టర్స్, ఓల్డ్ కరాసా, న్యూ కరాసా, నరేంద్రనగర్, గ్రీన్ గార్డెన్స్, పార్వతీనగర్, శ్రీనివాసనగర్, ఆర్ అండ్ బీ కూడలి ప్రాంతం, హుస్సేన్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

ఆర్పీ పేట పాఠశాలకు వితరణ


మైక్‌సెట్ అందజేస్తున్న పల్లా సోమేశ్వరరావు, తోట నగేష్

కంచరపాలెం: రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం కంచరపాలెం సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట నగేష్ ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, కిట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లా సోమేశ్వరరావు(జపాన్) చేతుల మీదుగా మైక్‌సెట్‌ను హెచ్‌ఎం శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి గండి రవి, గణేష్, బుల్లిబాబు, కిరణ్, తరుణ్, యశ్వంత్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై ధర్నా


సీఎండీ పృథ్వీతేజ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ నాయకులు

సీతమ్మధార: విద్యుత్ ఉద్యోగులకు 45 శాతం ఫిట్‌మెంట్‌తోపాటు మూడు వెయిటేజీలు ఇచ్చి పీఆర్‌సీని అమలు చేయాలని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ నాయకులు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం గురుద్వారా దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్ట్రగుల్ కమిటీ చైర్మన్ పి.సుదర్శన రెడ్డి, కన్వీనర్ పి.శివయ్య మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని, జేఎల్ఎం గ్రేడ్-2 ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రొబెషన్ డిక్లరేషన్ చేయాలన్నారు. కుటుంబంలో మరణించిన వారి ఉద్యోగాన్ని సభ్యులకు కల్పించాలని, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌గా మార్పు చేసి అందరికీ పాత విధానంలోనే పెన్షన్ సౌకర్యం కల్పించాలని, మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. విద్యుత్ సంస్థల్లో గుర్తింపు కోసం కార్మిక సంఘాలు ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలన్నారు. ధర్నా వద్దకు ద్వారకా ఏసీపీ మూర్తి ఆధ్వర్యంలో సీఐలు సింహాద్రినాయుడు, మల్లేశ్వరరావు, సోమశేఖర్, ఎస్ఐలు, సిబ్బంది భారీగా చేరుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ తదితరులు పాల్గొన్నారు.

21లోగా ఓటరు సర్వే పూర్తయ్యేలా కృషి


మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

సీతంపేట: ఈ నెల 21లోగా ఇంటింటా ఓటరు సర్వే పూర్తయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం షాదీఖానాలో పశ్చిమ నియోజకవర్గం(24) పరిధిలో ఉన్న బీఎల్‌వోలు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఇంటింటా ఓటరు సర్వేపై పలు సూచనలు, సలహాలిచ్చారు. ఫారం 6, 7, 8లను ఎలా వినియోగించాలి, ఓటరు నమోదు ప్రక్రియలో పాటించాల్సిన ముఖ్య విషయాలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు జయ, వీరభద్రరావు జోనల్ కమిషనర్లు ఆర్.జి.వి.కృష్ణ, మల్లయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోగ్రస్ కార్డులు


విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్న హెచ్‌ఎం శాంతికుమారి

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు ప్రోగ్రస్ కార్డులు పంపిణీ చేశారు. ఈ నెల 1, 2, 3 తేదీల్లో జరిగిన పార్మేటివ్-1 పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులతో రూపొందించిన ప్రోగ్రస్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. తమ పిల్లలు ఎలా చదువుతున్నది, ఏయే సబ్జెక్టుల్లో బాగా చదువుతున్నారు, వేటిలో వెనుకబడి ఉన్నారు తదితర విషయయాలు, తల్లిదండ్రుల సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేశారు. పాఠశాల హెచ్‌ఎం శాంతికుమారి మాట్లాడుతూ పిల్లలను ప్రతి రోజూ క్రమం తప్పకుండా స్కూల్‌కు పంపే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని సూచించారు. పిల్లలు ఎలా చదువుతున్నది గమనించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలతో విద్యను అందించడానికి ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పించిందని, వాటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

విశాఖ విద్య: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బీఎల్‌వోలు శ్రద్ధ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. గురువారం వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో విశాఖ ఉత్తరం, గాజువాక నియోజకవర్గాలకు సంబంధించిన బీఎల్వోలతో ఇంటింటా ఓటరు సర్వే కార్యక్రమంపై సమీక్షించారు. ఓటరు జాబితా పకడ్బందీగా సిద్ధం చేయాలన్నారు. ఓటరు నమోదు ప్రక్రియలో క్షేత్రస్థాయిలో అనుసరిస్తున్న విధి విధానాలపై బూత్ స్థాయి అధికారుల, ఏఈఆర్వో, ఈఆర్వోలకు దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది విధుల పట్ల తగిన అవగాహన కలిగి ఉండాలన్నారు. పొరపాట్లుకు తావులేకుండా పారదర్శకంగా అర్హులందరికీ ఓటు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ధ్యాన మందిరంలో దంత వైద్య శిబిరం



దంత వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ చిత్తరంజన్

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం బాబాకు ప్రత్యేక హారతులు, అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం హారతి అనంతరం భక్తులకు, పేదలకు అన్నదానం చేశారు. ధ్యాన మందిరం ప్రాంగణంలో మంగమ్మ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వచ్చిన భక్తులకు డాక్టర్ చిత్తరంజన్ దంత వైద్య పరీక్షలు నిర్వహించి, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. దంతాలు బాగుండాలంటే డాక్టర్లు ఇచ్చిన సలహాలు పాటించాలని, ప్రతి రోజు రెండు పూటలా పళ్లు తోముకోవాలని, ఆహారం తీసుకున్న తరువాత నోరు మొత్తం నీళ్లతో పుక్కిలించాలని సూచించారు. చాక్లెట్స్, సాఫ్ట్ డ్రింక్స్, బేకరి ఐటమ్స్ వీలైనంత తక్కువగా తీసుకుంటే మంచిదన్నారు. కార్యక్రమంలో ధ్యాన మందిర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జోరుగా ఓటర్ల సర్వే

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో ఓటర్ లిస్ట్ సర్వే ప్రక్రియ జోరుగా సాగుతోంది. గురువారం 291 సచివాలయం పరిధిలోని 251 బూత్ నంబర్‌లో గల ఓటరు జాబితాను బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌వో)జోసఫ్, బూత్ లెవల్ ఏజెంట్(బీఎల్ఏ) కరిమిరెడ్డి శ్యామ్ కలిసి వెరిఫికేషన్, మార్పులు, చేర్పులు చేశారు. కొత్త ఓటర్లను చేర్చడం, షిఫ్టింగ్, డిలిటేషన్, పేరులో మార్పులు తదితర అంశాలపై సర్వే చేశారు.

నరసింహనగర్ రైతుబజార్‌లో తనిఖీలు



రైతుల గుర్తింపు కార్డును పరిశీలిస్తున్న ఏడీ యాసిన్

సీతంపేట: వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ఏడీ ఎస్.కె.యాసిన్ గురువారం ఉదయం నరసింహనగర్ రైతుబజార్‌లో తనిఖీలు నిర్వహించారు. రైతుల స్టాళ్లు, డ్వాక్రా స్టాళ్లు, రైతుల గుర్తింపు కార్డులను పరిశీలించారు. డ్రాలో ఎవరికి కేటాయించిన స్టాళ్లలో వారే విక్రయాలు జరుపుతున్నారా లేదా అని తనిఖీ చేశారు. పంట ధృవీకరణ పత్రాలను ఏడీహెచ్ కార్యాలయానికి సకాలంలో అందజేయాలని రైతులకు ఆయన సూచించారు. రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు, సహాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

భయంతోనే సెక్షన్ 30 అమలు

సీతంపేట: వైఎస్సార్‌సీపీ నేతలకు వారాహి యాత్ర ఫీవర్ పట్టుకుందని, భయంతో వణికిపోతున్నారని జనసేన పార్టీ నాయకుడు, కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఎద్దేవా చేశారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ విశాఖలో వారాహి యాత్ర చేపడుతున్నారని, ఇప్పటి వరకు లేని సెక్షన్ 30ని విశాఖ చుట్టుపక్కల పెట్టారని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఇదే సెక్షన్ పెట్టి ఉంటే పాదయాత్ర జరిగేదా అని ప్రశ్నించారు.

హైదరాబాద్ వాసి.. విశాఖలో అదృశ్యం


రోహన్

తాటిచెట్లపాలెం: పాలిటెక్నిక్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని తండ్రి మందలించడంతో హైదరాబాద్‌కు చెందిన బాలుడు ఇంట్లో చెప్పకుండా విశాఖపట్నం వచ్చేసి.. అదృశ్యమయ్యాడు. విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలివీ.. నేరేడ్‌మెట్(హైదరాబాద్)కు చెందిన గోవర్ధన్.. కుమారుడు కె. రోహన్ రాజు(17)ను మందలించడంతో సికింద్రాబాద్‌లో రైలెక్కి ఈ నెల 4న విశాఖపట్నంలో దిగాడు. ఇక్కడ నుంచి వేరే వారి సెల్‌ఫోన్ నుంచి తన ఫ్రెండ్‌కు ఫోన్ చేసి విశాఖ వచ్చినట్లు చెప్పాడు. అతను బాలుడి తండ్రి విషయం చెప్పాడు. వెంటనే రోహన్ కోసం కుటుంబ సభ్యులు గాలించారు. ఎంతకీ ఆచూకీ లభించకపోవడంతో గురువారం రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రోహన్ ఇంటి నుంచి బయలు దేరినప్పుడు క్రీం కలర్ టీషర్ట్, డార్క్ బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, చామన చాయ రంగు, సన్నగా ఉంటాడని తండ్రి గోవర్ధన్ తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు గవర్నమెంట్ రైల్వేపోలీస్ స్టేషన్‌లో గానీ, సబ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావుకు 98664 13487లో గానీ తెలియజేయవచ్చు.

నులిపురుగుల నివారణకు చర్యలు


కనకమ్మవీధి-2 అంగన్‌వాడీ కేంద్రంలో బాలికతో మాత్ర మింగిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్


మధురానగర్ హైస్కూల్‌లో విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది

- పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

సీతంపేట: పిల్లల్లో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం(డీ వార్మింగ్ డే) సందర్భంగా గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు. 25వ వార్డు కనకమ్మవారి వీధి-2 అంగన్‌వాడీ కేంద్రంలో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ చేతుల మీదుగా పిల్లలకు ఈ మాత్రలు అందజేశారు. మాత్రను నీటిలో కరిగించి చిన్నారుల చేత మింగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోందని, పోషకాహార లోపాలను నివారించేలా పౌష్టికాహారం అందజేస్తుందని తెలిపారు. పిల్లల్లో రక్తహీనతకు గురిచేసే నులిపురుగుల నివారణకు ప్రతి ఏటా ప్రభుత్వం అల్బెండజోల్ మాత్రలు అందజేస్తోందన్నారు. రక్తహీతన ఉన్న వారిని పాఠశాల స్థాయిలోనే గుర్తించి ఐరన్ ఫోలిక్ సిరప్, మాత్రలు అందిస్తున్నట్టు తెలిపారు. పాత రేసపువానిపాలెం వైద్యాధికారి మనస్వి, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.బేగం ఆల్బెండజోల్ మాత్రల వల్ల కలిగే ప్రయోజనాలు, చేతుల పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో వార్డు స్పెషల్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, ఆర్ఐ మురళీకృష్ణ, ఏఎన్ఎం జి.వి.రమణి, అంగన్‌వాడీ కార్యకర్త పి.శారదదేవి, ఆశా కార్యకర్త సంధ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మధురానగర్ జీవీఎంసీ పాఠశాలల్లో..

25వ వార్డు మధురానగర్ జీవీఎంసీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ అందజేశారు. హెచ్‌ఎంలు శాంతికుమారి, దేముడుబాబు పర్యవేక్షణలో సచివాలయ సిబ్బంది హైస్కూల్‌లో 450 మంది, ప్రైమరీ స్కూల్‌లో 150 మంది విద్యార్థులకు, పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ చిన్నారులకు మాత్రలు పంపిణీ చేసి మింగించారు. కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎంలు కె.కృష్ణవేణి, కె.దివ్య, ఆశా వర్కర్లు డి త్రివేణి, కె.స్రవంతి, కె.గౌతమి పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం

జీవీఎంసీ 43వ వార్డు తారకరామానగర్-2 అంగనవాడీ కేంద్రంలో చిన్నారులతో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తినే ముందు చేతులు బాగా శుభ్రం చేసుకోవాలని, దానివల్ల నులిపురుగులు నోటి ద్వారా మన శరీరంలోకి ప్రవేశించకుండా నిరోధించవచ్చన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యానికి మేలు కలుగుతుందన్నారు. అంగన్‌వాడీ టీచర్ ఎస్.పార్వతి పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలతోపాటు సమీప ప్రాంతంలోని చిన్నారులకు సిబ్బందితో కలిసి ఏఎన్ఎం స్రవంతి నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ మౌలాబీబీ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తల్లిదండ్రులకు సూచించారు. నులిపురుగుల వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలపై స్థానికులకు, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రతి చిన్నారి విధిగా ఈ మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఆశా వర్కర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

చేతుల శుభ్రత ముఖ్యం

మురళీనగర్: విద్యార్థులు వ్యక్తిగత పరశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని మాధవధార జీవీఎంసీ హైస్కూల్ హెచ్‌ఎం బ్రహ్మాజీ అన్నారు. విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజూ తినడానికి ముందు, తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. ఇంట్లో అందరూ ఈ మాత్రలు వేసుకోవాలన్నారు. బయాలజీ ఉపాధ్యాయురాలు కె.హైమ పాల్గొన్నారు.


గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారితో మాత్ర మింగిస్తున్న ఏఎన్ఎం స్రవంతి


తారకరామానగర్‌లో చిన్నారితో మాత్ర మింగిస్తున్న ఉషశ్రీ

పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలి


ధర్నా చేస్తున్న ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ నాయకులు

తాటిచెట్లపాలెం: పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని, ఎన్‌పీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం డీఆర్ఎం కార్యాలయం వెనుక ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రామిక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జె.సంపత్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎన్‌పీఎస్‌ను తీసుకొచ్చి, పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేయడం వల్ల కార్మికులు నష్టపోతారన్నారు. వైస్ ప్రెసిడెంట్, ఇన్‌చార్జి డివిజనల్ కో ఆర్డినేటర్ టి.వి.మౌళీశ్వరరావు మాట్లాడుతూ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేస్(ఎన్ఎఫ్ఐఆర్) పిలుపు మేరకు వాల్తేర్ డివిజన్‌లో ఈ ధర్నా చేపట్టినట్లు తెలిపారు. హాస్పిటల్‌లో పనిచేసే అటెండెంట్స్, ట్రాక్ మెయింటనర్స్‌ను ఎల్‌డీసీఈ పరీక్షలకు అనుమతించాలని, ఫెడరేషన్ అగ్రిమెంట్స్ ప్రకారం రైల్వేలో గ్రూప్-డీ పద్ధతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రికల్ లోకోషెడ్ వాల్తేర్‌లోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అనంతరం నాయకులందరూ ర్యాలీగా బయలుదేరి ఏడీఆర్ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహోకు మెమోరాండం సమర్పించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ టి.నరసింగరావు, జాయింట్ జనరల్ సెక్రటరీ, డిప్యూటీ డివిజనల్ కో ఆర్డినేటర్ బి.సత్యనారాయణ, ఎ.వెంకటరావు(ఏజేజీఎస్), కె.నాగేశ్వరరావు(ఎజేజీఎస్), సిహెచ్.గాంధీ(గౌరవ కేంద్ర కార్యవర్గ సభ్యులు), ఇ.ఈశ్వరరావు, ఎం.వి.పాపారావు, పి.ఎం.పాత్రో, ఆయా విభాగాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెటలర్జీలో ఉపాధి అవకాశాలు


వీవీఎస్ రాజును సత్కరిస్తున్న కాలేజీ సిబ్బంది

మురళీనగర్: మెటలర్జీలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని సెల్‌యూకేలో హెల్త్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ మేనేజర్ వీవీఎస్ రాజు అన్నారు. ఎన్‌బీఏ గుర్తింపు కోసం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఆధునికంగా తయారు చేసిన మెటలర్జీ ల్యాబ్‌ను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మెటలర్జీ కోర్ సెక్టార్‌తోపాటు దాని అనుబంధ రంగాల్లో అనేక విస్తృత ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. కాలేజీ పూర్వ విద్యార్థిగా ల్యాబ్‌ల అభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. కాలేజీ ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వీవీఎస్ రాజును ఘనంగా సత్కరించారు. విభాగాధిపతి డాక్టర్ కె.రత్నకుమార్ పాల్గొన్నారు.

సినీ సంగీత విభావరి రేపు

సీతమ్మధార: గీత్ సంగీత్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12న ఓసి మనసా.. నీకు తెలుసా.. శీర్షికన సినీ సంగత విభావరి నిర్వహించనున్నట్లు మాజీ ఏడీసీపీ, సంస్థ వ్యవస్థాపకుడు మహ్మద్ ఖాన్ తెలిపారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని సింధూర గెస్ట్ హౌస్‌లో గురువారం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ తేదీ సాయంత్రం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సంగీత విభావరి జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్రకు చెందిన గాయనీ, గాయకులు పలు గీతాలు ఆలపిస్తారని చెప్పారు. సంగీత ప్రియులు పాల్గొని విజయవంతం చేయాలని ఖాన్ కోరారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెయిన్ లైన్‌లో డీఆర్ఎం తనిఖీలు


రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) సౌరభ్ ప్రసాద్ గురువారం డివిజన్ పరిధిలోని మెయిన్ లైన్‌లో గురువారం పర్యటించారు. విశాఖపట్నం-పలాస సెక్షన్ పరిధిలో పూండి నుంచి విశాఖ వరకు విండో ట్రయలింగ్ తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల భద్రత, సౌకర్యాలు, పరిశుభ్రత, నిర్వహణ అంశాలను పరిశీలించారు. విశాఖ రైల్వేస్టేషన్ నుంచి కొత్తవలస, చీపురుపల్లి, తిలారు, శ్రీకాకుళంరోడ్, నౌపడ వరకు ఈ తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా బ్రిడ్జిలు, లెవల్ క్రాసింగ్స్, మలుపుల్ని పరిశీలించారు. పర్యటనలో డీఆర్ఎంతో పాటు సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్‌కుమార్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ ఎస్.కె.పాత్ర, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఎంఎస్ఎన్ మూర్తి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.